సాక్షి
గుంటూరు
మంగళవారం, 13, ఆగస్టు, 2024



40,878 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 40,878 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 35,198 బస్తాల అమ్మకాలు జరిగాయి.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో 37.55 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు. ఇది 169 అడుగులకు సమానం. పవర్ జనరేషన్‌కు 12వేల క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 5,527 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 292 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

ఢిల్లీ స్వాతంత్య్ర వేడుకలకు జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వానం



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ రాజధాని ఢిల్లీలో ఈనెల 15న జరగనున్న స్వాతంత్య్ర వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఆమె భర్త కత్తెర సురేష్‌కుమార్ పాల్గొననున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందినట్లు హెనీ క్రిస్టినా సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పంచాయతీరాజ్ సంస్థల తరఫున ఢిల్లీలో జరగనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న హెనీ క్రిస్టినా ఈనెల 14న ఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. ఆ తర్వాత తీన్‌మూర్తి మార్గంలోని ప్రధానమంత్రి సంగ్రహాలయ సందర్శన కార్యక్రమంలో పాల్గొంటారు. 15న ఎర్రకోటలో నిర్వహించే జాతీయ పతాక ఆవిష్కరణ వేడుకల్లో పాల్గొంటారు.

ఏఎన్‌యూకు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్

ఏఎన్‌యూ(గుంటూరు): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్-2024) సోమవారం సాయంత్రం విడుదల చేసిన ర్యాంకులలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్థానం దక్కించుకుంది. ఇందులో ఓవరాల్ యూనివర్సిటీ కేటగిరీలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 97వ స్థానాన్ని పొందింది. స్టేట్ యూనివర్సిటీ కేటగిరీలో 20వ ర్యాంకును దక్కించుకుంది. ఫార్మసీ కళాశాలల విభాగంలో 63వ ర్యాంకును సాధించింది. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ గంగాధరరావు, రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ జి. సింహాచలం హర్షం వ్యక్తం చేశారు.

రేపు సెంట్రల్ ఎక్సైజ్ పెన్షన్ అదాలత్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్రంలోని సెంట్రల్ ఎక్సైజ్, సర్వీస్ టాక్స్, సెంట్రల్ జీఎస్టీ శాఖలలో పనిచేసిన విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ సమస్యల పరిష్కారానికి పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గద్దె తిలక్, టి.వివేకానంద ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు కన్నావారితోటలోని కేంద్ర జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు పెన్షన్ అదాలత్ సమావేశం జరుగుతుందని తెలిపారు. పెన్షనర్లు తమ సమస్యలు, ఫిర్యాదులను పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చునని పేర్కొన్నారు. ఈ అదాలత్‌లో కస్టమ్స్ అండ్ సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పాల్గొని పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తారని వివరించారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: నగరంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం రూరల్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు రిఫ్రెష్ ట్రైనింగ్ ప్రోగ్రాం(శిక్షణ తరగతులు) నిర్వహించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వసంతరాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, చేపట్టాల్సిన కార్యచరణపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచనలు చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్యం తదితర సౌకర్యాల కల్పనపై చర్చించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదినారాయణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి కారుణ్య నియామక ఉత్తర్వులు

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



గుంటూరు వెస్ట్: ముగ్గురు నిరుద్యోగులకు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆడిట్, పోలీస్, డ్వామా శాఖల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగం బాధ్యతగా చేసుకోవాలని ఈ సందర్భంగా జేసీ వారికి వివరించారు. డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సర్దుపోటుపై సమరం

- వెల్లువెత్తిన నిరసనలు
- తప్పులతడక జాబితాలపై ఆగ్రహం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో సర్దాల్సిన టీచర్లు 600 మందే
- కానీ 1,200 మంది స్థాన చలనానికి అధికారుల ప్రతిపాదన!
- ఇష్టారాజ్య బదిలీలను ఒప్పుకోబోమన్న ఉపాధ్యాయ సంఘాలు
- దిగొచ్చిన సర్కారు.. ప్రక్రియను వాయిదా వేస్తున్నట్టు ప్రకటన



మంగళగిరి ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ గందరగోళంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఆధారంగా ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల వారీగా సోమవారం విడుదల చేసిన సర్దుబాటు జాబితాలపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. సీనియార్టీని తుంగలో తొక్కి, విధుల్లో చేరిన తేదీకి బదులు పుట్టిన తేదీని పరిగణనలోకి తీసుకుని జాబితాలు తయారు చేశారని ఉపాధ్యాయవర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రాధాన్య పాయింట్ల కేటాయింపు గందరగోళంగా ఉందని టీచర్లు నిప్పులు చెరుగుతున్నారు.

ఎంఈఓ కార్యాలయాలకు పరుగులు

సర్దుబాటు జాబితాల విడుదలతో ఉపాధ్యాయులు సోమవారం ఎంఈఓ కార్యాలయాలకు పరుగులు తీశారు. ఈ జాబితాలపై విద్యాశాఖ అధికారులు అభ్యంతరాలు స్వీకరించారు. దీంతో ఉపాధ్యాయులు పాఠశాలలకు సోమవారం సెలవు పెట్టి మరీ ఎంఈఓ కార్యాలయాలకు వెళ్లారు. జాబితాలు అసంబద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 600 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉందని ప్రాథమికంగా గుర్తించినా విద్యాశాఖాధికారులు తీసుకున్న అస్తవ్యస్త విధానాలతో దాదాపు 1,200 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలగనుందని ఉపాధ్యాయ నాయకులు చెబుతున్నారు. దీంతో ఎంఈఓ కార్యాలయాల వద్ద ఉపాధ్యాయులు వాగ్వాదాలకు దిగారు. నిరసన వ్యక్తం చేశారు. గుంటూరు నగరంతోపాటు మంగళగిరి, తెనాలితోపాటు పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని ఎంఈఓ కార్యాలయాలు సోమవారం టీచర్ల నిరసనలతో హోరెత్తాయి.

సీనియార్టీ లెక్కింపుపై ఆందోళన

ఉపాధ్యాయుల సీనియార్టీ విషయంలో అధికారులు తీసుకున్న కొలమానంపై సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవానికి ఒకే డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులను విధుల్లో చేరిన తేదీ, కేడర్ ఆధారంగా సీనియర్, జూనియర్‌గా పరిగణించాలి. అయితే అధికారులు వయస్సు ఆధారంగా సీనియార్టీని లెక్కించడం ఉపాధ్యాయుల అసహనానికి కారణమైంది.

బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన ఫ్యాప్టో

సర్దుబాటు ప్రక్రియను బహిష్కరిస్తున్నట్లు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) సోమవారం ప్రకటించింది. జాబితాలు తప్పుల తడకగా ఉన్నందున ఉపాధ్యాయులెవరూ ఎంఈఓ కార్యాలయాల్లో జరిగే కౌన్సెలింగ్‌కు వెళ్లరాదని పిలుపునిచ్చింది.

విధివిధానాలు మార్చాల్సిందే

నిరసనలతో ప్రభుత్వం దిగి వచ్చింది. సర్దుబాటు ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతానికి వాయిదా వేసినా, విధి విధానాలు మార్చకుంటే ప్రక్రియను ముందుకు వెళ్లనీయబోమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, ఎండీ ఖాలీద్, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.



అభ్యంతరాలు సమర్పించేందుకు గుంటూరు ఎంఈఓ కార్యాలయానికి వచ్చిన ఉపాధ్యాయులు



అమరవీరులకు అంజలి ఘటిస్తున్న మంత్రి మనోహర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, జేసీ భార్గవ్‌తేజ, అధికారులు

త్యాగం చిరస్మరణీయం

- రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్
- క్విట్ ఇండియా అమర వీరులకు నివాళి

తెనాలిరూరల్: స్వాతంత్య్ర పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమానిది ప్రముఖ స్థానమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. 1942లో జరిగిన క్విట్‌ఇండియా ఉద్యమం సమయంలో పోలీసు కాల్పుల్లో ఆగస్టు 12న ఏడుగురు తెనాలి వీరులు అమరులు కావడం చరిత్రలో మరిచిపోలేని ఘట్టమని అభివర్ణించారు. క్విట్ ఇండియా ఉద్యమ అమరవీరుల సంస్మరణ దినాన్ని తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న నేతృత్వంలో గాంధీచౌక్ వద్ద నుంచి రణరంగ చౌక్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులు, ఎన్‌సీసీ విద్యార్థులు, కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు జాతీయ జెండాలను చేత పట్టుకుని భారీ ప్రదర్శనగా రణరంగ చౌక్ వద్దకు చేరుకున్నారు. అక్కడ మంత్రి నాదెండ్ల మనోహర్ వీరితో కలిశారు. రణరంగ చౌక్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో అసువులు బాసిన ఏడుగురు అమరవీరుల స్థూపాల వద్ద పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో తెనాలిలో జరిగిన పోలీసు కాల్పుల్లో అమరులైన ఏడుగురు వీరుల త్యాగాలను స్మరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, డీఎస్పీ బి.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



రణరంగ చౌక్‌లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉద్యమ స్ఫూర్తిని చాటుదాం

తెనాలిఅర్బన్: స్వాతంత్య్రోద్యమంలో తెనాలికి ప్రత్యేక స్థానం ఉందని, ఆ ఉద్యమ స్ఫూర్తిని చాటుదామని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రణరంగచౌక్‌లోని క్విట్ ఇండియా ఉద్యమంలో అసువులుబాసిన వారి స్మారకార్థం నిర్మించిన స్థూపాలకు సోమవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేశారు.

వీవీఐటీలో 'చియాన్ విక్రమ్' సందడి



విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న హీరో విక్రమ్, హీరోయిన్ మాళవిక మోహనన్

పెదకాకాని: వీవీఐటీలో స్టార్ యాక్టర్, విలక్షణ నటుడు చియాన్ విక్రమ్ సందడి చేశారు. విక్రమ్ ప్రధాన పాత్రలో దర్శకుడు పారంజిత్ రూపొందించిన పాన్ ఇండియా చిత్రం 'తంగలాన్' ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో హీరోయిన్ మాళవిక మోహనన్ నటుడు డానియల్‌తో కలసి విక్రమ్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీకి సోమవారం విచ్చేసిన చిత్రబృందానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హీరో విక్రమ్ మాట్లడుతూ ఐదు భాషలలో విడుదల కానున్న ఈ చిత్రంలో తన పాత్ర వినూత్నంగా ఉండబోతుందని తెలిపారు. చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, మంచి ఎమోషనల్ చిత్రంగా రూపొందించామని దర్శకుడు పా రంజిత్ అన్నారు. శివపుత్రుడు, అపరిచితుడు, ఐ వంటి తన చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారని, తంగలాన్ చిత్రాన్ని కూడా అలాగే ఆదరించాలని కోరారు. ప్రతి పనిలో కష్టం ఉంటుందని, ఇష్టంగా చేయడం ద్వారా విజయం అందుకోవచ్చని విద్యార్థుకు సూచించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. అనంతరం చిత్రబృంద సభ్యులు విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

పానకంలో పుడక

- నృసింహుని పానకం వేలంలో మంత్రి పీఏ జోక్యం
- అతడి ఆదేశాలతో బేజారైన అధికారులు..
- పాట రద్దు చేసి వెంటనే మళ్లీ పెట్టాలని కమిషనర్ ఆదేశాలు
- టెండర్లు లేకుండా నేరుగా తమ వాళ్లకే ఇవ్వాలని టీడీపీ నేతల ఒత్తిళ్లు

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి పానకం వేలం పాట వివాదాస్పదంగా మారింది. గత ఏడాది పానకం హక్కులకు వేలంపాట జరిగింది. ఈ ఏడాది అక్టోబర్ 21 వరకు పాత పాటదారుడికి హక్కులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెలలో అధికారులు మళ్లీ వేలం పాటకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఇంతలోనే టీడీపీ నేతలు కొందరు రాష్ట్ర మంత్రి పీఏ అరుణ్ దృష్టికి తీసుకెళ్లి అధికారులకు ఫోన్లు చేయించి పాత పాటను రద్దు చేయించారు. రాజకీయ జోక్యంతో అధికారులు ఏమి చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. మంత్రి పీఏ ఫోన్లలోనే ఆదేశాలు జారీ చేయడంపై ఉన్నతాధికారులూ విస్తుపోతున్నారు. మంత్రి పీఏ ఒత్తిళ్లు భరించలేని దేవదాయ శాఖ కమిషనర్ పాటను రద్దు చేసి వెంటనే మళ్లీ టెండర్లు పిలవాలని ఆదేశాలు జారీచేశారు. అయితే టెండర్లు కాకుండా నేరుగా తమ వాళ్లకే పానకం హక్కులు ఇవ్వాలని టీడీపీ నాయకులు కిందిస్థాయి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏం చేయాలో పాలుపోక ఆలయ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. విధులకు హాజరయ్యేందుకూ వణికిపోతున్నారు.



అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: అర్జీల పరిష్కారంలో వేగం పెంచాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ అధికారులను ఆదేశించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వచ్చే వారి విజ్ఞప్తులను అధికారులు సీరియస్‌గా తీసుకోవాలని, అలసత్వం విడనాడాలని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ వచ్చిన ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కొన్ని అర్జీలను మొక్కుబడిగా చూసి మూసేస్తున్నారని, అందుకే ప్రజలు పదేపదే వస్తున్నారన్నారు. ఇప్పటికే శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను వచ్చే సోమవారంలోపు పరిష్కరించాలని చెప్పారు. కోర్టు కేసులపై కౌంటర్లు సకాలంలో దాఖలు చేయాలని తెలిపారు. అనంతరం వచ్చిన 148 ఫిర్యాదులను జేసీతోపాటు, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు స్వీకరించి పరిశీలించారు.



గ్రీవెన్స్ కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

క్వారీలో అక్రమార్కులు



పేరేచర్ల సమీపంలో కొందరు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. వాస్తవానికి ది పేరేచర్ల తెల్ల క్వారీ వడ్డెర క్వారీ వర్కర్స్ లేబర్ కాంట్రాక్ట్ సహకార సంఘం లిమిటెడ్ కిందకు వస్తుంది. క్వారీలో కొందరు రాజకీయ నాయకులు చేరి అక్రమ మైనింగ్ చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని, మాకు న్యాయం చేయండి.

– క్వారీ కార్మికులు

ఉద్యోగం కోసం రూ.3 లక్షలు లంచం డిమాండ్



గతంలో నా భర్త పి.అప్పారావు పొన్నూరులోని వైద్య శాఖలో పనిచేస్తూ మరణించారు. ఆ తర్వాత ఆ ఉద్యోగం నా కుమారుడు శ్రీనివాసరావుకు ఇచ్చారు. అతను 2021లో అనారోగ్యంతో మరణించాడు. నా కుమారుడికి వివాహం కాలేదు. ఆ ఉద్యోగం నాకు ఇవ్వాలని అడుగుతుంటే ఇక్కడే ఉన్న ఓ మహిళా అధికారి రూ.3 లక్షలు లంచం డిమాండ్ చేస్తున్నారు. నాకు న్యాయం చేయండి.

– పి.పోలమ్మ, పొన్నూరు

హర్‌ఘర్ తిరంగాను జయప్రదం చేయండి

- ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరాలి
- జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్ : ఎంతో మంది ప్రాణ త్యాగాల ఫలితమే మనకు లభించిన స్వేచ్ఛాస్వాంతంత్ర్యాలని, త్యాగధనులను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యతని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ 78వ స్వాతంత్య్ర వేడుకలు వైభవంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈనెల 15 వరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా రోజూ ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపైనా త్రివర్ణ పతాకం ఎగురవేయాలని కోరారు. చేనేత, జౌళి వస్త్రాలను ప్రోత్సహించేందుకు వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించాలన్నారు. అనంతరం జేసీ, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పిడి హరిహరనాథ్ జాతీయ జెండాలను ప్రదర్శించారు.



జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, జిల్లా అధికారులు

20న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

ఈనెల 20న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒక్కొక్క విద్యార్థికి 400 ఎంజీ ఆల్బెండజోల్ మాత్ర ఇవ్వాలని సూచించారు. ఒక్క మాత్ర మాత్రమే ఇవ్వాలని చెప్పారు. 1-5 సంవత్సరాల మధ్య వయస్సున్న చిన్నారులతో అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ మాత్రలు మింగించాలని సూచించారు. రెండేళ్లలోపు పిల్లలకు అరమాత్ర నీళ్లల్లో కలిపి పట్టించాలని చెప్పారు. పిల్లలకు చేతులు శుభ్రం చేసుకునే అంశంపైనా అవగాహన కల్పించాలని వివరించారు. అనంతరం నులిపురుగుల దినం పోస్టర్‌ను జేసీ, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ ఆవిష్కరించారు.

పారిశుద్ధ్య కార్మికుల జీవనంపై పటిష్ట సర్వే

కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికుల జీవన ప్రమాణాలపై సర్వే పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ట్రైనీ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్‌లతో కలిసి జిల్లా అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి ఈ సర్వే నిర్వహించాలన్నారు. ప్రొహిబిషన్ ఆఫ్ మాన్యువల్ స్కావెంజర్స్ యాక్ట్ ప్రకారం సర్వే ఉండాలన్నారు. ఈనెల 28 నాటికి సర్వే పూర్తిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు పారిశుద్ధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. ఈనెల 20న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేపట్టాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకంపై అర్హులకు లబ్ధి చేకూర్చాలని వివరించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతి బుధవారం ప్రత్యేకాధికారులు పరిశీలించాలని సూచించారు. బాల్య వివాహాల నియంత్రణకు కృషి చేయాలని ఆదేశించారు. పీఎం ఆవాస్ యోజనలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని చెప్పారు. జిల్లాలో ఈనెల 16 నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులు జయప్రదం చేయాలని చెప్పారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

క్లుప్తంగా

కరాటేలో ఆరుగురికి బంగారు పతకాలు



తెనాలిఅర్బన్: జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో కఠెవరం గ్రామానికి చెందిన నివాస్ కరాటే, మార్షల్ ఆర్ట్స్ అకాడమి విద్యార్థులకు ఆరు బంగారు బహుమతులు, ఏడు వెండి బహుమతులు కైవసం చేసుకున్నారు. ఎంఎంటీ టీమ్ ఆధ్వర్యంలో పోటీలు ఆదివారం తెనాలిలో నిర్వహించారు. గెలుపొందిన వారికి సోమవారం అకాడమిలో బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ముఖ్యఅతిథిగా హాజరై మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కోచ్ కిరణ్‌రెడ్డి, టీమ్ మేనేజర్ ఎస్.ఉషా శ్రీ పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో హాషిస్‌కు సిల్వర్ మెడల్



మంగళగిరి: జాతీయ స్థాయి స్కేటింగ్‌లో మెరుగుపాల హాషిస్ సిల్వర్ మెడల్ సాధించాడు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు సమీపంలోని పొల్లాచిలో జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలు ఈ నెల 7వ తేదీ నుంచి 11 వరకు నిర్వహించారు. మంగళగిరి– తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డొల్లాస్ నగర్‌కు చెందిన మెరుగుపాల హాషీస్ ప్రతిభ చూపాడు. అండర్– 14 జూనియర్ విభాగంలో హాషిస్ ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో ఆరు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. హాషిస్ కుంచనపల్లి అరవింద స్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. ప్రతిభ చూపిన విద్యార్థిని కోచ్ సత్యనారాయణ అభినందించారు.

సామాజిక ఇతివృత్తాలే శింగమాల కథలు

సాక్షి, అమరావతి: మానవ జీవన సంఘర్షణ, సామాజిక సమస్యల ఇతివృత్తాలతో శింగమాల సుబ్రహ్మణ్యం అద్భుత కథా రచనలను సృష్టించారని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం వెలగపూడిలో సచివాలయ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో సచివాలయంలో ప్రముఖ రచయిత, రాష్ట్ర సచివాలయ అధికారి శింగమాల సుబ్రహ్మణ్యం రాసిన కథల సంపుటి 'వెలుగు పూలు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ప్రజాశక్తి బుక్ హౌస్ వర్కింగ్ ఎడిటర్ వొర ప్రసాద్, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్ఆర్ఐ ఫౌండేషన్ సీఈఓ గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, సచివాలయ సాంస్కృతిక సంఘం అధ్యక్షుడే డి.స్వర్ణరాజు, సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రధానకార్యదర్శి పి.శ్రీకృష్ణ, పురపాలకశాఖ సహాయ కార్యదర్శి టి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

స్థానికులకు అందుబాటులోకి పాలన

- ఇక నుంచి ప్రతి నియోజకవర్గంలో ప్రజా వేదిక
- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడి
- 126 అర్జీలు స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు

మంగళగిరి: స్థానికులకు పరిపాలన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక లక్ష్యమని జిల్లా కలెక్టర్ జి.నాగలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు ఉన్నతాధికారులు హాజరై ప్రజా సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రతి సోమవారం మండలం, తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తున్నట్లు వివరించారు. వేగంగా ప్రజా సమస్యలు పరిష్కారానికి నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని చెప్పారు. తొలిసారిగా మంగళగిరిలో నిర్వహిస్తున్నామని, ఇలాగే ప్రతి వారం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమయానికి సమస్యలు పరిష్కరించడంతో పాటు సోమవారాలలో గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చేందుకు గుంటూరు వచ్చే ఇబ్బంది లేకుండా స్థానికంగా అందుబాటులో ఉండేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, పెన్షన్స్, సంక్షేమ పథకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రజా సమస్యలు.. పరిష్కార వేదిక జరుగుతున్నా ప్రతి సోమవారం యథావిధిగా గ్రీవెన్స్ జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా 126 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, తహసీల్దార్ షేక్ మాబు సుభాని పాల్గొన్నారు.

దేవస్థాన భూములు పరిరక్షించాలని వినతి

పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి చెందిన రూ.కోటి విలువైన స్థలం ఆక్రమణకు గురయినా అధికారులు పట్టించుకోవడం లేదని కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆలయ గాలి గోపురం ఎదురుగా ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయం వద్ద రూ.కోటి విలువైన 7 సెంట్ల స్థలాన్ని స్థానిక బీజేపీ, టీడీపీ నాయకులు మద్దతుతో జంజనం మల్లేశ్వరరావు ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టినా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని సోమవారం జరిగిన ప్రజా సమస్యలు.. పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.నాగలక్ష్మికి స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే దేవదాయ, రెవెన్యూ అధికారులను స్థలాన్ని పరిశీలించి విచారించి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.

వర్సిటీలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం



డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్. విభాగం ఆధ్వర్యంలో సోమవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. యూనివర్సిటీ కళాశాలల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో పలు విభాగాల విద్యార్థులకు నాషా ముక్త్ భారత్ అభియాన్‌పై క్విజ్, వ్యాసరచన పోటీలు, చర్చలు నిర్వహించి డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వి.దివ్యతేజో మూర్తి, నేటి యువత దేశ భక్తిని చాటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా, విశ్వవిద్యాలయాన్ని ఉంచుతామని విద్యార్థిని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి రెక్టార్ కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ జి.సింహచలం, వివిధ కళాశాలు ప్రిన్సిపాల్స్, యూనివర్సిటీ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కె.వి.నిరుపయ, డి.సూర్యనారాయణ, శ్రీనివాసరావు, ఉమాశంకర్, సృజన పాల్గొన్నారు.

అంబేడ్కర్ చైర్‌లో..

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో సోమవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ వై.అశోక్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. అబ్రహం లింకన్, గణిత విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ సంఘం జిల్లా నూతన కార్యవర్గం



మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖపట్నంలో ఈనెల 11వ తేదీన నిర్వహించిన ఎన్నికలలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సుభానిలను ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బి.ప్రసాద్‌లను ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు మద్ది ప్రభాకర్ అభినందించారు.

రేపు జిల్లా స్థాయి షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్ పురుషుల, మహిళల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఎం.కిషోర్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మేడికొండూరు మండలం, మందపాడులోని శ్రీనివాస హైస్కూల్లో ఏర్పాటు చేశామన్నారు. ప్రతిభకనబరచిన వారిని ఎంపిక చేసి రాష్ట్ర పోటీలకు పంపిస్తామని వివరించారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి



మౌలిక సదుపాయాలను పరిశీలిస్తున్న లీలావతి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి చెప్పారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం జెడ్పీ ఆవరణలోని బాలికా సదనంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లల గదులు, ఆహారం, వైద్య సేవలు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. విద్య వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జీవన జ్యోతి, రక్షణాధికారి బి.విజయకుమార్ పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో మోసం

- ఎస్పీని ఆశ్రయించిన బాధితులు
- భారీగా వచ్చిన వినతులు



బాధితుడితో మాట్లాడుతున్న జిల్లా ఏఎస్పీ రమణమూర్తి

నగరంపాలెం: నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి(పరిపాలన), ఎ.శ్రీనివాసరావు(క్రైం) బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను జిల్లా ఏఎస్పీలు ఆలకించారు. సకాలంలో సమస్యలకు చట్టపరిధిలో న్యాయం చేయాలని సూచించారు. డీఎస్పీలు శివాజీరాజు (సీసీఎస్), సుబ్బారావు (మహిళా పీఎస్) కూడా అర్జీలు స్వీకరించారు.

రూ.20 లక్షలు పోగొట్టుకున్నా..

హోల్‌సేల్ క్లాత్ మర్చంట్స్‌లో వ్యాపారం చేశా. గత నెల్లో ఓ ప్రైవేటు సెక్యూరిటీకి సంబంధించి స్టాక్ మార్కెట్ యాప్‌లో సభ్యుడిగా చేరా. గత నెల, ప్రస్తుత నెల్లో రూ.20 లక్షలు సెక్యూరిటీ నిర్వాహకులు చెప్పిన ఖాతాల్లో జమ చేశాను. ఈనెల 8న నగదు డ్రా చేద్దామని ప్రయత్నించగా, దానికి కారణాలు చెబుతూ ఇంకనూ డబ్బులు చెల్లించాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అవి చెల్లించకపోతే లీగల్ నోటీసులు పంపిస్తామని బెదిరిస్తున్నారు. దీనిపై సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాను.

– సీహెచ్.రవికుమార్, అరుంధతినగర్ 4వ వీధి, గుంటూరు

'ఇటీవల అడపా బజార్‌కు చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యారు. గతంలో పలువురికి ఉద్యోగాలు ఇప్పించానని నమ్మించారు. నలుగురం కలిసి అతడికి రూ.లక్ష చొప్పున ముట్టజెప్పాం. అయితే నెలలు గడిచినా అవుట్ సోర్స్ ఉద్యోగాలు ఇప్పించలేదు. కనీసం డబ్బులైనా చెల్లించాలని అడుగుతున్న పట్టించుకోవడంలేదు. రాజకీయ పలుకుబడి ఉందని మరో సారి ఇంటికొస్తే చంపుతామని బెదిరిస్తున్నారు. అప్పులు చేసి డబ్బులు తీసుకొచ్చామని, వడ్డీలు చెల్లించక పోతున్నాం.' అంటూ సామ్రాజ్యం గరికపాడు, జయశ్రీ, ఎస్.అంకమ్మరావు, టి.వెంకటేశ్వర్లు విన్నవించారు.

ఫ్లెక్సీలు తొలగించారు..

లాడ్జి కూడలిలోని ఏఈఎల్‌సీ భవన సముదాయంలో ఓ అసోసియేషన్‌ను నిర్వహిస్తున్నాం. ఈ క్రమంలో కార్యాలయం వద్ద కట్టిన ఫ్లెక్సీలను మే 19న గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. కార్యాలయంలో ఉన్న వ్యక్తిని చితకబాదారు. ఈ విషయమై దాడికి పాల్పడిన వారితో మాట్లాడి, వివాదాలు వద్దని చెప్పాం. మరలా మరి కొందరితో వచ్చి దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడ్డారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు.

–ఎస్.నాగభూషణం, రాజీవ్‌గాంధీనగర్

తప్పుడు ఫిర్యాదులతో..

తెనాలి చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లోని ఇంట్లో 2010 నవంబర్‌లో గృహ ప్రవేశం చేశాం. అప్పటి నుంచి అక్కడే ఉంటున్నాం. గత నెల్లో 4వ తేదీన తనపై స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. తాను ఉంటున్న ఇంటిని ఎవరికో విక్రయించినట్లు, ఆ ఇంటిని తాను ఖాళీ చేయట్లేదని నాపై తప్పుడు ఫిర్యాదు చేసింది. అయితే ఆస్తి విషయమై కేసు కోర్టులో నడుస్తోందని పోలీసుల దృష్టికి తీసుకొచ్చాం. దీంతో కేసు ముగిసే వరకు ఎవరూ గొడవలకు వెళ్లవద్దని సూచించారు. ఇటీవల తమ ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు తిరుగుతున్నారు. విధులకు వచ్చే పోయే సమయంలో ఇంటికి రావాలంటే భయంగా ఉంటుంది. త్వరలో ఇల్లు ఖాళీ చేయాలని కొందరు బెదిరిస్తున్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నా

–మామిడి విజయకుమార్, ప్రభుత్వ ఉద్యోగి, చెంచుపేట, తెనాలి

మాతృమరణాలపై సమీక్ష

గుంటూరు మెడికల్: జిల్లాలో కొప్పురావూరు కాలనీలో చోటుచేసుకున్న మాతృమరణంపై సోమవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. మాతృమరణానికి కారణాలు, నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. భవిష్యత్‌లో మాతృమరణాలు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వైద్య అధికారులకు సూచించారు. సమావేశంలో వైద్య విధాన పరిషత్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం రాజు, జీజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి అరుణ, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి శ్రావణ్‌బాబు, ఎన్‌హెచ్ఎం డీపీఎంఓ రత్నమన్మోహన్, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ సుధాకర్ బాబు, డాక్టర్ రాధికారాయుడు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



పెదకాకాని: శతాధిక వృద్ధురాలు భీమిరెడ్డి సుబ్బమ్మ(101) మృతి చెందింది. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన భీమిరెడ్డి సుబ్బమ్మ భర్త వీరారెడ్డి 36 సంత్సరాల కిందట మరణించాడు. సుబ్బమ్మకు ఐదుగురు మగ, ఒక ఆడ సంతానం. 101 సంత్సరాలు జీవితంలో సుబ్బమ్మ కుమారులు, కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవళ్లు, మునిమనువరాళ్లను చూసింది. రెండు రోజులుగా ఆమె శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతుంది. సోమవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచింది. పెద్ద ఎత్తున బంధుమిత్రులు, గ్రామ ప్రజలు సుబ్బమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం నంబూరు హిందూ శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

కిలోన్నర గంజాయి స్వాధీనం



అరెస్టయిన వారితో సీఐ భాస్కర్

పొన్నూరు: పట్టణ పరిధిలో గంజాయి పట్టుబడిన కేసులో నలుగురిని అరెస్టు చేసి వీరి వద్ద నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ పి.భాస్కర్ తెలిపారు. స్థానిక స్టేషన్‌లో సోమవారం వివరాలు వెల్లడించారు. చెడు వ్యసనాలకు బానిసలైన గుంటూరుకు చెందిన షేక్ జబిరుల్లా, ఉప్పు కార్తిక్, షేక్ ఇషాక్, పొన్నూరు డీవీసీ కాలనీకి చెందిన దేవరకొండ రాజ్‌కుమార్, ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడుకు చెందిన ఇర్ల చైతన్య, గంజాయి తాగడంతో పాటు డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో గంజాయి విక్రయాలకు అలవాటు పడ్డారు. ఈ నేపథ్యంలో ఉప్పు కార్తీక్ వద్దనున్న కిలోన్నర గంజాయిని వాటాలు వేసుకుని పట్టణ పరిధిలోని ఇంటూరు అడ్డరోడ్డు వద్ద విక్రయించేందుకు సిద్ధమవ్వడంతో పోలీసులు ఆకస్మిక దాడులు చేసి యువకులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో నలుగురిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. షేక్ జబిరుల్లా పరారీలో ఉన్నాడని అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ భాస్కర్ చెప్పారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

లక్ష్మీపురం: దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములు అయిన విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో (ఏఐఎస్ఎఫ్) ఆవిర్భావ దినం సోమవారం నిర్వహించారు. తొలుత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే ఒలంపిక్స్‌లో భారత్ పతకాలు సాధనలో విఫలమైందని పేర్కొన్నారు. అమెరికా, చైనా, జపాన్ లాంటి దేశాలు అద్భుత ప్రతిభ చూపుతుంటే భారత్ మాత్రం 71వ స్థానానికి పరిమితమైందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నాయకులు మేడా హనుమంతరావు, రాజశేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జంగాల చైతన్య, వలి, యశ్వంత్, కిరణ్, శివా, నవ్యశ్రీ, డేవిడ్, అమర్నాథ్, కిరణ్, అజయ్, బన్నీ పాల్గొన్నారు

ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పట్నంబజారు: ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై చోటుచేసుకుంది. పాత గుంటూరు ఎస్ఐ పి.భాగ్యరాజ్ తెలిపిన వివరాలు.. తెనాలి డిపో నుంచి సోమవారం గుంటూరు వస్తున్న బస్సులో మార్గంమధ్యలో గుర్తు తెలియని ఒక వ్యక్తికి ఫిట్స్‌లా వచ్చాయి. బస్సులో ఉన్న ప్రయాణికులు సాయం అందించటంతో తేరుకున్నాడు. అయితే, గుంటూరు బస్టాండ్‌కు చేరుకునే సరికి సీటులో మృతి చెందాడు. బస్ కండక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పాత గుంటూరు ఎస్ఐ భాగ్యరాజ్ ఫోన్ నంబర్ 8688831329కు సమాచారాన్ని అందించాలని కోరారు.

పోటాపోటీగా ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

- పురుషుల విభాగంలో గుంటూరు..
- మహిళా విభాగంలో విజయనగరం జట్లు విజయం



బహుమతులు అందజేస్తున్న డాక్టర్ ఇన్నారెడ్డి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని గుడ్ షపర్డ్ పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ముగిశాయి. విజేతలైన వారికి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఇన్నా రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పురుషుల విభాగంలో గుంటూరు, మహిళా విభాగంలో విజయనగరం జట్లు విజయం సాధించి ప్రథమస్థానంలో నిలిచాయి. పురుషుల విభాగంలో రెండవ స్థానంలో అనంతపురం, మూడవ స్థానంలో నెల్లూరు, నాల్గవ స్థానంలో విజయనగరం జట్లు నిలిచాయి. మహిళా విభాగంలో రెండవ స్థానంలో అనంతపురం, మూడవ స్థానంలో గుంటూరు, నాల్గవ స్థానంలో కర్నూలు జట్లు నిలిచాయి. వీరిలో జాతీయ స్థాయిలో ఆడే జట్లను ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరసింహా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీడీలు చిరంజీవి, సురేష్, రాధాకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

చెరువుకు కన్నం పెట్టిన ఎలుకలు



చెరువు కట్ట తెగి పొలాల్లోకి వెళుతున్న నీరు



ఎలుకలు చేసిన కన్నం

ప్రత్తిపాడు: చెరువుకు ఎలుకలు కన్నం పెట్టాయి.. అవును నిజమే. ప్రత్తిపాడు మండలం యనమదలలోని 735 సర్వే నంబరులో 60 ఎకరాల భూమి ఉంది. అందులో 41.52 ఎకరాల పరిధిలో చెరువు ఉంది. ఈ చెరువుకు ఓ వైపు ఎలుకలు చిన్న చిన్న కన్నాలు చేశాయి. ఆ చిన్నపాటి కన్నాలు పెద్దవి అవడంతో సోమవారం సాయంత్రం చెరువు కట్ట తెగి, అందులో ఉన్న నీరు పక్కనున్న సుమారు 70 ఎకరాల పంట పొలాల్లోనికి వృథాగా పోతున్నాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ శాఖ అధికారులు, స్థానికులు, ప్రజాప్రతినిధులు రెండు పొక్లెయిన్‌తో మట్టి తోలించారు.